

చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 894 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.15
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
39.5°/ 16.8°
జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



న్యూస్‌రీల్

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి


పంట రుణాల ఖాతాలు పరిశీలిస్తున్న ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత

ధర్మవరం రూరల్: ఏడీసీసీ బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులంతా సకాలంలో రెన్యూవల్ చేసుకుని ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత సూచించారు. మంగళవారం ఆమె పట్టణంలోని ఏడీసీసీ బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ పరిధిలోని వివిధ సొసైటీల ద్వారా మంజూరు చేసిన పంట రుణాలు, రెన్యూవల్స్ గురించి ఆరా తీశారు. రైతులు సకాలంలో పంట రుణాలను రెన్యూవల్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ సురేఖరాణి, మేనేజర్ నాగార్జున, సూపర్‌వైజర్లు రహంతుల్లా, నాగవేణి, సొసైటీ సీఈఓలు నారాయణ స్వామి, దామోదర్, శ్రీధర్, పృథ్వీ, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి... రూ.40 వేల అపహరణ

ఓడీ చెరువు: మండల పరిధిలోని బాబాసాహెబ్‌పల్లి వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనదారుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి అతని వద్దనున్న రూ. 40 వేలు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వీర ఓబునపల్లికి చెందిన జనార్దన్‌రెడ్డి కదిరిలోని రిలియన్స్ టెలీకాం కంపెనీలో పని చేస్తున్నాడు. భార్య పుట్టింట్లో ఉండగా, మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో కదిరి నుంచి అత్తగారి ఊరైన బాబసాహెబ్‌పల్లికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. గ్రామ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తులు జనార్దన్‌రెడ్డి ద్విచక్రవాహనాన్ని అడ్డగించారు. అనంతరం దాడి చేసి అతని వద్దనున్న రూ. 40 వేలు ఎత్తుకెళ్లారు. అపస్మారక స్థితిలో పడిఉన్న జనార్దన్‌రెడ్డిని గుర్తించిన స్థానికులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సామాజిక ఆవిష్కరణలు కావాలి

- జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్దన


టెక్‌ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన

అనంతపురం: ఇంజినీర్లు సమాజానికి దోహదపడే ఆవిష్కరణలు చేయాలని జేఎన్‌టీయూ(ఏ) వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన సూచించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తొలిసారిగా టెక్ ఫెస్ట్-2కే23 నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్‌లో రేస్ 2కే23, ఎలక్ట్రికల్ విభాగం ఐ-2కే23, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం డైనమిక్స్ 2కే23, ఎలక్ట్రానిక్స్ విభాగం ఈ-మెర్జ్2కే23, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో పిక్సెల్ 2కే23, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఫ్యూషన్2కే23 సదస్సులు నిర్వహించారు. సదస్సులకు ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. టెక్‌ఫెస్ట్-23 సదస్సుల ద్వారా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. సమస్యలను పరిష్కరించే రీతిలో నూతన అంశాలు తెలుసుకోవడానికి ఇలాంటి వేదిక దోహదపడుతుందన్నారు. విశిష్ట అతిథి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం అనివార్యమని స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలపై నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. అనంతరం వివిధ విభాగాల్లో సావనీర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవాని తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం.. రైతు భాగ్యం

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అన్నదాతకు ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన సమస్తాన్ని ముంగిళ్లలోనే అందిస్తున్నారు. తాజాగా సాగులో నీటి వృథాను అరికట్టేందుకు బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అర్హులైన రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు అందజేస్తోంది. ఫలితంగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందువరుసలోనిలవగా మన జిల్లా జాతీయ స్థాయిలో 14వ స్థానంలో, రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది.

- బిందు, తుంపర సేద్యానికి ప్రోత్సాహం
- విరివిగా రాయితీలిస్తోన్న జగన్ సర్కార్
- ఉత్సాహంగా ముందుకు వస్తున్న రైతన్న


పుట్టపర్తి సమీపంలో ఓ రైతు పొలంలో తుంపర సేద్య పరికరాలు

8,000 హెక్టార్లు
ఈ ఏడాది సూక్ష్మ సేద్యం లక్ష్యం

2,000
ప్రభుత్వం కేటాయించిన అదనపు లక్ష్యం

9,617
ఇప్పటికే సూక్ష్మ సేద్య పరికరాలు అందుకున్న రైతులు

3
సూక్ష్మ సేద్యంలో రాష్ట్రంలో జిల్లా స్థానం

సాక్షి, పుట్టపర్తి: వ్యవసాయాన్ని పండుగ చేసి రైతులను మరింత ప్రోత్సహించి ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే అర్హులైన రైతులకు రాయితీలపై సూక్ష్మ సేద్య పరికరాలను అందిస్తోంది.

బిందు, తుంపర సేద్యంతో నీటి పొదుపు..
అతి తక్కువ నీటితోనే పంట పండించేందుకు ప్రభుత్వం బిందు (డ్రిప్), తుంపర (స్ప్రింక్లర్) సేద్యం పరికరాలను అందిస్తోంది. అర్హులైన రైతులకు రాయితీ తో అందిస్తోంది. రైతు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతు భరోసా కేంద్రం అధికారులతో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖ అసిస్టెంట్లు, సూక్ష్మ సేద్య పరికరాల కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి భూ విస్తీర్ణం, బోరు సౌకర్యం తదితర వివరాలను పరిశీలిస్తారు. పరిశీలన పూర్తయిన తర్వాత అర్హులుగా తేలిన వారికి పరికరాలను రాయితీతో అందజేస్తారు.

రాయితీలు ఇలా..
బిందు సేద్యంలో తొలి ఐదు ఎకరాల వరకు 90 శాతం, ఐదు నుంచి పది ఎకరాల వరకు 70 శాతం రాయితీ ఉంటుంది. తుంపర సేద్యం పరికరాలకు ఐదు ఎకరాల వరకు 55 శాతం, ఐదు నుంచి 12.5 ఎకరాల వరకు 45 శాతం సబ్సిడీ వర్తిస్తుంది.

లక్ష్యానికి మించి పంపిణీ..
ఈ ఏడాది జిల్లాకు 8 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం పరికరాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అడిగిన వారందరికీ సూక్ష్మసేద్య పరికరాలు పంపిణీ చేశారు. ఫలితంగా గడువు కంటే ముందే లక్ష్యం పూర్తయ్యింది. దీంతో ప్రభుత్వం అదనంగా మరో 2 వేల హెక్టార్లు కేటాయించింది. ఏడాది వ్యవధిలో జిల్లాలో 9,617 మంది రైతులు డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను రాయితీ ద్వారా అందుకున్నారు. అందులో 5,664 మంది డ్రిప్, 2,437 మంది స్ప్రింకర్లను వినియోగించుకున్నారు. ఇప్పటికే 84 శాతం మేర మెటీరియల్ కూడా సరఫరా చేశారు.

జాతీయ స్థాయిలో 14, రాష్ట్రస్థాయిలో 3వ స్థానం..
ఇక సూక్ష్మ సేద్యం లక్ష్య సాధనలో దేశంలోనే శ్రీసత్యసాయి జిల్లా 14వ స్థానంలో నిలిచింది. అనంతపురం జిల్లా 8వ స్థానం, అన్నమయ్య 11, వైఎస్సార్ జిల్లా 15, ప్రకాశం జిల్లా 21 స్థానాల్లో నిలిచాయి. దీంతో ఆయా జిల్లాలకు అదనపు లక్ష్యాలు నిర్దేశించారు. ఆ లక్ష్యాల్లోనూ సగం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక అత్యధిక సూక్ష్మసేద్య పరికరాలు పంపిణీ చేసి అనంతపురం జిల్లా రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండగా.. మన జిల్లా మూడో స్థానంలో నిలిచింది. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లా రెండో స్థానంలో ఉంది.

జగన్ కృషి మరువలేనిది



రైతు సంక్షేమంపై వైఎస్సార్ సీపీ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. రైతుల కోసం సీఎం జగన్ చేస్తున్న కృషి మరువలేనిది. రాయితీతో డ్రిప్, స్ప్రింకర్లు అందజేయడం వల్ల ఎంతో మంచి జరుగుతోంది. నేను కూడా రాయితీ ద్వారా డ్రిప్ పరికరాలు పొందాను. మంచిగా పని చేస్తున్నాయి. నీరు ఆదా అవుతోంది. – నాగరాజు, అగళి

పరికరాలు త్వరగా ఇచ్చారు



నేను సూక్ష్మ సేద్యం పరికరాల కోసం రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోగానే, అధికారులు స్పందించారు. డ్రిప్ పరికరాలు త్వరగా అందజేశారు. ఎక్కడా జాప్యం జరగలేదు. తోటలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటితడులు ఇచ్చుకుంటున్నా. – నజీర్‌సాబ్, అగళి

మాలాంటోళ్లకు ఎంతో మేలు



సూక్ష్మ సేద్యం పరికరాలు సొంతంగా కొనే ఆర్థిక స్తోమత మాకు లేదు. ప్రభుత్వం రాయితీతో పరికరాలు ఇవ్వడం వల్లే నేనూ తీసుకున్నా. నీటి తడులకు ఇబ్బందులు లేకపోవడంతో తోటలో పంటలు సాగు చేస్తున్నా. – గంగమ్మ, రొళ్ల

అర్హులకు అందజేస్తున్నాం



అర్హులందరికీ సబ్సిడీ పరికరాలు అందజేస్తున్నాం. అధికారులే నేరుగా పొలాల వద్దకు వెళ్లి పరిశీలించి.. అంచనాలు తయారు చేస్తారు. విచారణ పూర్తయిన తర్వాత అర్హులను గుర్తించి.. పరికరాలు అందజేస్తాం. ఈ ఏడాది లక్ష్యం ఇప్పటికే పూర్తయింది. అదనంగా మరో రెండు వేల హెక్టార్ల లక్ష్యం విధించారు. అందులోనూ సగం పూర్తి చేశాం. – సుదర్శన్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చేతన్ పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్

పుట్టపర్తి అర్బన్: ఎంపిక చేసిన గ్రామాల్లో రీ సర్వే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, సర్వే శాఖ ఏడీ రామకృష్ణతో కలిసి రీ సర్వే పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా పనిచేసి గడువులోపు రీ సర్వే పనులు పూర్తి చేయాలన్నారు. మడకశిర, హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి, పరిగి మండలాలకు సంబంధించిన రికార్డులను మరోసారి సరి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎల్ఆర్ నమోదులో ఎదురయ్యే సమస్యలను జేసీ నివృత్తి చేశారు. ఒకే సర్వే నంబర్‌లో ఇద్దరి పేర్లు ఉన్నప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, భూమి ఉన్నప్పటికీ పాస్ పుస్తకం లేకపోతే తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నప్పుడు కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించాలన్నారు. గ్రామాల రికార్డులు పక్కాగా ఉండాలని, వెబ్‌ల్యాండ్, డాక్యుమెంటేషన్, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. సర్వేలో అంకిత భావం, చిత్తశుద్ధి, సమన్వయం ఎంతో అవసరమన్నారు. తహసీల్దార్లు రీ సర్వే పనులను సకాలంలో పూర్తి అయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలు, అపోహలు ఉంటే వెంటే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డివిజన్‌స్థాయి అధికారులు, డీటీలు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్ఓలు పాల్గొన్నారు.


సమీక్షకు హాజరైన జిల్లా అధికారులు, సిబ్బంది

లోకేష్.. దమ్ముంటే చర్చకు రా!

- పెనుకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కనిపించలేదా?
- మీ తాతది 2 ఎకరాల చరిత్ర... మాది 50 ఎకరాల చరిత్ర
- నా కుటుంబం గురించి మాట్లాడితే నాలుక తెగ్గోస్తా
- జగనన్నను విమర్శిస్తే ప్రజలే నిన్ను తరిమి కొడతారు జాగ్రత్త
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ హెచ్చరిక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: ''నాలుక మందం మండళగిరి లోకేష్ ... ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు. లేదంటే ప్రజలే నిన్ను తరిమి కొడతారు'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ హెచ్చరించారు. మంగళవారం ఆయన పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరిటాల శ్రీరాములు పెనుకొండ ప్రాంతంలో భూములు పంచాడని, ఈ ప్రాంతం పరిటాల పోరుగడ్డ అంటూ లోకేష్ బహిరంగ సభలో ఏదేదో మాట్లాడాడని, అయితే రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలానికి చెందిన పరిటాల శ్రీరాములుకు ఈ ప్రాంతంతో ఉన్న సంబంధం ఏంటో అతనే చెప్పాలన్నారు. పరిటాల రవి పెనుకొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో జరిగిన హత్యాకాండ గురించి లోకేష్ తెలుసుకోవాలన్నారు.

నీ స్థాయి ఏమిటో తెలుసుకో
సీఎం జగన్ నవరత్నాల పథకాలు పకడ్బందీగా అమలు చేస్తూ జనరంజక పాలన అందిస్తుండటంతో ప్రజలకు ప్రతిపక్షంతో పనిలేకుండా పోయిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని లోకేష్ జనం వద్ద సానుభూతి కోసం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని శంకరనారాయణ మండిపడ్డారు. జగనన్నను విమర్శిస్తే జనమే తరిమికొడతారన్న విషయం తెలుసుకోవాలన్నారు. జగనన్నను విమర్శించే ముందు లోకేష్ తన స్థాయి ఏమిటో తెలుసుకోవాలన్నారు. 151 సీట్లు గెలిచి సీఎం అయిన జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ.... దొడ్డిదారిన మంత్రి పదవి పొందిన నువ్వెక్కడ..? ఇంకోసారి జగన్‌మోహన్‌రెడ్డి గురించి నోరు జారితే తోలు తీస్తాం జాగ్రత్త... అని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన 'యువగళాన్ని' అడ్డుకుంటున్నాడని లోకేష్ ప్రగల్భాలు పలుకుతున్నాడని, జగనన్న కనుసైగ చేస్తే చాలు జనం నీ బట్టలూడదీసి తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్న విషయం తెలుసుకోవాలని హితవు పలికారు.

అభివృద్ధిలో అనకొండనే..
తనను పెనుకొండ అనకొండనని లోకేష్ విమర్శించాడని, తాను నిజంగా అనకొండనేనని శంకరనారాయణ తెలిపారు. అభివృద్ధిలో, సంక్షేమంలో, కార్యకర్తలను కాపాడుకోవడంలో తాను నిజంగా అనకొండనేనన్నారు. టీడీపీ నాయకుల్లా మందు కోసం, సమయం కోసం వేచి చూడడం తన నైజం కాదన్నారు. పెనుకొండ అభివృద్ధి రూ. వందల కోట్లలో జరిగిన విషయాన్ని లోకేష్ కళ్లు తెరిచి చూడాలన్నారు. ఆర్‌అండ్‌బీ నుంచి రూ.253 కోట్లు, పీఆర్ నుంచి రూ.69 కోట్లు, మెడికల్ కళాశాలకు రూ. 475 కోట్లు, రొద్దంలో బీసీ స్కూల్‌కు రూ. 15 కోట్లు, బాబయ్య దర్గాకు రూ.4 కోట్లు, షీఫారానికి రూ. 2 కోట్లు, అదే విధంగా 81 సచివాలయాలు, 70 ఆర్బీకేలు, 61 వెల్‌నెస్ సెంటర్లు, 39 మిల్క్‌చిల్ సెంటర్లు, 24 డిజిటల్ లైబ్రరీలకు సంబంధించి రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. 2014లో టీడీపీ నేతలంతా కలిసి బాబొస్తే జాబొస్తుందని నమ్మించారని, తీరా బాబు అధికారంలోకి వచ్చాక మండళగిరి లోకేష్‌కు మాత్రమే జాబొచ్చిందని ఎద్దేవా చేశారు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే 1.36 లక్షల సచివాలయ ఉద్యోగాలు, గ్రూప్ 1, గ్రూప్ 2, పోలీస్ ఉద్యోగాలు, 40 వేల మెడికల్ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఇవన్నీ ప్రజలకు తెలుసన్నారు. మైకు దొరికిందని అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరన్నారు.

దమ్ముంటే చర్చకు రా...లెక్కలు తీద్దాం
తాను అధికారంలోకి వచ్చాకేదో సంపాదించానని లోకేష్ ఆరోపించారని, అతనికి దమ్ముంటే ఉమ్మడి జిల్లా దాటేలోపు దీనిపై బహిరంగ చర్చకు రావాలని శంకరనారాయణ సవాల్ విసిరారు. 'లోకేష్... మీ తాత ఖర్జూర నాయుడుది 2 ఎకరాల చరిత్ర, మా తాత కొండప్ప 50 ఎకరాల భూస్వామి' ఈ విషయం మీ చెంచాలను ఎవరిని అడిగినా చెబుతారన్నారు. లేదా నువ్వే ఎంక్వయిరీ చేయించుకో అని సలహా ఇచ్చారు. తన తండ్రి, తాను రాజకీయ జీవితంలో రూ.వందల కోట్ల విలువైన భూములు పోగొట్టుకున్నామన్నారు. ఆ భూములు ఎక్కడ , ఎవరికి విక్రయించామో చూపిస్తా....రా అంటూ లోకేష్‌కు సూచించారు. మీ తాతల నుంచి నీకు వచ్చిన ఆస్తులు...మీరు చేసిన వ్యాపారాలు...మా కున్న ఆస్తులు..మేము చేసిన పనులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. తన కుటుంబంపై అవాకులు చవాకులు పేలితే నాలుక చీరేస్తానని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, నాగలూరు బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న వాహనాల వేలం

హిందూపురం టౌన్: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 31న ఉదయం 11 గంటలకు సెబ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ స్వర్ణలత పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

ప్రశాంతి నిలయం: ఇంటర్మీడియెట్ ఫస్టియర్ (జనరల్) పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు జిల్లాలోని 99 కేంద్రాల్లో కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలు నిర్వహించగా, 929 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చివరి రోజు మొత్తం 31,198 మంది విద్యార్థులకు గాను 30,269 మంది పరీక్షలు రాశారు. వీరిలో జనరల్ విద్యార్థులు 28,890 మందికి గాను 28,098 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,308 మందికి గాను 2,171 మంది హాజరైన వారిలో ఉన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ఏప్రిల్ 4 వరకు పరీక్షలు ఉంటాయని ఆర్ఐఓ సురేష్‌బాబు తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

- జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల ఏర్పాటు
- వివరాలు ధ్రువీకరించుకోకపోతే 'ఆధార్' సస్పెన్షన్


ఎనుములపల్లి ప్రత్యేక శిబిరంలో ఆధార్ అప్‌డేట్ చేసుకుంటున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: కేంద్రం ఆధార్ వివరాల అప్‌డేషన్‌ను తప్పనిసరి చేసింది. లేకపోతే ఆధార్ కార్డులు సస్పెన్షన్‌లో పడతాయని హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పౌరులంతా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకునేందుకు సచివాలయాల్లో 'ఆధార్' ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసింది.

ఆధార్ లేకపోతే అంతే...
ఆధార్‌కార్డు ప్రతి ఒక్కరికీ అత్యంత ప్రధానమైనది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా, బ్యాంకుల్లో వ్యక్తిగత ఖాతాలు తెరవాలన్నా, విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టు పొందాలన్నా, ప్రతి చోటా ఆధార్ అవసరం ఉంటుంది. బ్యాంకు ఖాతాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఓటరు కార్డు, పాన్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాలని కేంద్రం ఆదేశిస్తోంది. అయితే ఆధార్ వచ్చిన కొత్తలో ఎలాంటి డాక్యుమెంట్లు తీసుకోకుండానే ఆధార్ కార్డులు జారీ చేశారు. అందువల్ల ప్రస్తుతం డాక్యుమెంట్లను ఇచ్చి ఆధార్ అప్‌డేట్ చేసుకోవడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.

సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు
ఆధార్‌లో వివరాల అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం జిల్లాలోని 75 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో నామమాత్రపు ఫీజుతో ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవచ్చు. జిల్లాలో 13,02,526 మంది ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం 2,21,623 మంది వివలరాలు అప్‌డేట్ చేసుకున్నారు. ఇంకా 10,80,903 మంది ఆధార్ అప్‌డేట్ చేసుకోలేదని, వారంతా త్వరపడాలని అధికారులు సూచిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఆధార్ అప్‌డేట్‌కు గడవు ముగియనుండడంతో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రజల్లో అవగాహన కల్పించి అప్‌డేట్ ఆధార్ చేసుకునేలా చూడాలని డీఆర్‌ఓ కొండయ్య ఆదేశించారు.

అప్‌డేట్ ఎందుకంటే
2010 నుంచి 2015 వరకూ ఆధార్ కార్డులు మంజూరుకు ఎలాంటి డాక్యుమెంట్లు తీసుకోలేదు. దీంతో బోగస్ కార్డులు పెరిగిపోయాయి. అందువల్ల ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తోంది.

- 2016 తర్వాత ఆధార్‌లో ఫొటో, జన్మదినం తేదీ, చిరునామా మార్చుకోని వారు డాక్యుమెంట్లు అప్‌డేట్ చేసుకోవాలి.
- ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా వాసులకు గతంలో అనంతపురం జిల్లా అని ఉంటుంది. అందువల్ల పేరు, చిరునామాతో పాటు తప్పనిసరిగా జిల్లా పేరు మార్చుకోవాల్సి ఉంటుంది.
- ఆధార్ కార్డు సస్పెన్షన్ అయితే కార్డులో లింకు అయిన బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్, సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. ఆధార్‌లో ఏ చిన్న తప్పు ఉన్నా... భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు వస్తాయి. వివాహానికి ముందు, తరువాత మహిళలు ఆధార్ అప్‌డేట చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంజూరు చేసిన సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

నేటి నుంచి 'నవమి' వేడుకలు

ప్రశాంతి నిలయం: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం ప్రశాంతి నిలయంలో శ్రీరామ నవమి సందడి మొదలైంది. సత్యసాయి సన్నిధిలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న వేడుకలకు సెంట్రల్ ట్రస్ట్ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేసింది. వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. బుధవారం వేదపఠనంతో నవమి వేడుకలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత శివం బృందం భక్తి గీతాలాపన, మంగళహారతి నిర్వహిస్తారు. సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసుడు ముత్తు కుమార్ బృందం 'శ్రీరామ స్మరణ' పేరుతో సంగీత విభావరి నిర్వహిస్తారు. 30వ తేదీన సీతారాముల కల్యాణం, సత్యసాయి పూర్వపు ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం సాయి సంగీత రామామృతం పేరుతో సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు సంగీత కచేరి నిర్వహించనున్నారు.


సత్యసాయి మహాసమాధి(ఫైల్)

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు సక్రమంగా ఉండాలి
- ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి

కనగానపల్లి: పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సక్రమంగా ఏర్పాటు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖాధికారి మీనాక్షి ఆదేశించారు. కనగానపల్లిలో పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసిన స్థానిక జిల్లా పరిషత్, మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వరాదన్నారు. డెస్కులు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి సక్రమంగా ఏర్పాటు చేయించాలని ఎంఈఓ అరుణమ్మను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవికిరణ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రావెలర్.. యువకుడి మృతి


ఆటోను ఢీకొన్న ట్రావెలర్ వాహనం


పురుషోత్తం మృతదేహం

పెనుకొండ: పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయం ఎత్తు వద్ద 44వ జాతీయ రహదారిపై ట్రావెలర్ వాహనం ఢీకొని ధర్మవరం ప్రాంతానికి చెందిన పురుషోత్తం (24) అనే యువకుడు మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పురుషోత్తం ఆటోలో బియ్యం వేసుకుని సోమందేపల్లి వైపు వస్తుండగా వెనుక నుంచి టెంపో ట్రావెలర్ ఢీకొంది. దీంతో ఆటో ముందున్న మోరీని ఢీకొని రోడ్డు పక్కన పడిపోయింది. తీవ్రంగా గాయపడిన పురుషోత్తం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకొచ్చిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

అపూర్వ 'స్పందన'

- కష్టాలు తీరుస్తున్న పోలీసులు
- ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు
- గతంలో 'అనంత' వెళ్లాలంటే వ్యయప్రయాసలు
- నేడు పుట్టపర్తికి సులువుగా రాకపోకలతో జనం ఆనందం


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

సాక్షి, పుట్టపర్తి: పుట్టపర్తి పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. సమస్యలు ఓపిగ్గా విని అర్జీలు స్వీకరించిన అధికారులు, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రజల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది. గతంలో అనంతపురం జిల్లా కేంద్రం వెళ్లాలంటే వ్యయ ప్రయాసలు భరించాల్సి వచ్చేది. కొత్త జిల్లా ఏర్పడ్డాక పుట్టపర్తికి రాకపోకలు సులువయ్యాయి. దీంతో ఎలాంటి సమస్య వచ్చినా జిల్లాకేంద్రంలో నిర్వహించే 'స్పందన'కు వచ్చి ప్రజలు అర్జీలు సమర్పిస్తున్నారు.

ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా..

ప్రతి వారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'స్పందన'కు ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, భూ ఆక్రమణలు, దోపిడీలు, చోరీలు, నేరాలు, అనుమానాస్పద మృతులపై ఫిర్యాదులు, హత్యలు, ఉద్యోగాల పేరుతో టోకరా, సైబర్ నేరాలు తదితర అంశాలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇందులో కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, చోరీలకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా 'స్పందన'కు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న అధికారులు కిందిస్థాయి సిబ్బందితో నేరుగా మాట్లాడి వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తున్నారు. పలు కేసుల్లో ఇరు వర్గాలను పిలిచి రాజీ కుదిర్చి సంతోషం పంచుతున్నారు.

98 శాతం పరిష్కారం..

జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకూ (మార్చి 27) పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 2,254 ఫిర్యాదులు అందాయి. వాటిలో 98 శాతం మేర అంటే సుమారు 2,100 సమస్యలు పరిష్కారమయ్యాయి. మిగతా ఫిర్యాదుల్లో స్పష్టత లేకపోవడంతో వీగిపోయినట్లు జిల్లా పోలీసు కార్యాలయంలోని 'స్పందన' సిబ్బంది ద్వారా తెలిసింది.

వ్యయ ప్రయాసలు తప్పాయి



గతంలో అనంతపురంలో నిర్వహించే 'స్పందన' కార్యక్రమానికి వెళ్లాలంటే రోజు మొత్తం వెచ్చించాల్సి వచ్చేది. పుట్టపర్తి జిల్లా కేంద్రం కావడంతో ప్రస్తుతం అరగంటలో చేరుకుంటున్నాం. మళ్లీ గ్రామాలకు వెళ్లి పనులు చేసుకునే వీలు కలుగుతోంది.

– జయచంద్రనాయక్, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి మండలం

తొందరగా పరిష్కారం



జిల్లా కేంద్రం దగ్గరగా ఉండటంతో సమస్యల పరిష్కారం కోసం అధికారులు వచ్చేందుకు కూడా అవకాశం కలుగుతోంది. స్పందనలో అర్జీలు ఇచ్చిన మరుసటి రోజే సంబంధిత అధికారులను సంప్రదించవచ్చు. వైఎస్ జగన్ ప్రభుత్వం కొత్త జిల్లా ఏర్పాటు చేయడం మంచిదే అయింది.

– అర్షాబేగం, హిందూపురం

ఒక్క అర్జీని కూడా విడిచిపెట్టం



'స్పందన'లో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నాం. అర్జీ వచ్చిన మరుసటి రోజే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఏ ఒక్క ఫిర్యాదు కూడా మరవడానికి లేదు. అలాగే, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– రాహుల్‌దేవ్‌సింగ్, ఎస్పీ

విశ్వగురు భారత్!

- జేఎన్‌టీయూఏ వీసీ రంగజనార్దన ఆశాభావం
- అట్టహాసంగా ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవం
- క్రీడల్లో ప్రతిభ చాటే వారికి నెలకు రూ.10 వేల ఉపకారవేతనం



క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న వీసీ

అనంతపురం: మానవ వనరులు అపారంగా ఉండి జాతి పురోగతికి విశేషంగా కృషి చేస్తున్న యువశక్తిశీల దేశంగా భారత్ విరాజిల్లుతోందని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్పోర్ట్స్‌డే నిర్వహించారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటి స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు గెలుపొందే విద్యార్థులకు రూ.25 వేలు ప్రోత్సాహక బహుమతితో పాటు నెలకు రూ.10 వేల ఉపకార వేతనం అందిస్తామన్నారు. 2047 నాటికి భారత్ అగ్రరాజ్యంగా ఏర్పడి విశ్వ గురుగా గుర్తింపు దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ, దక్షిణ భారత అంతర్ వర్సిటీ స్థాయి పోటీల్లో గత విద్యా సంవత్సరంలో 25 మంది విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్నిచోట్లా జేఎన్‌టీయూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటారన్నారు. క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. భవానీ, జనరల్ కెప్టెన్ అమృతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ద్వారా రైతులకు విశిష్ట సేవలు


మహాజన సభలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ద్వారా రైతులకు విశిష్ట సేవలందిస్తున్నామని చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం డీసీఎంఎస్ కార్యాలయంలో బిజినెస్ మేనేజర్ టి.విజయభాస్కర్ అధ్యక్షతన 79వ వార్షిక మహాజన సభ నిర్వహించారు. చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం డీసీఎంఎస్ సేల్స్ పాయింట్స్ ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అమ్మకాలు సాగిస్తున్నామన్నారు. పురుగు మందుల అమ్మకాలు, పప్పుశనగ కొనుగోళ్లు కూడా చేస్తున్నట్లు వెల్లడించారు. ఎరువుల అమ్మకాల ద్వారానే ఈ ఏడాది రూ.8.83 కోట్లు, మిగతా వాటి ద్వారా మరో రూ.3 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మున్ముందు రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్లు శ్రీరామరెడ్డి, జగదీష్‌చౌదరి, జబీవుల్లా, నాగమ్మ, హెచ్.కిష్టప్ప, ఎంజీ సుమంగళమ్మ, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు స్పందన కరువు


పాదయాత్రగా వెళుతున్న లోకేష్


టీడీపీ కార్యకర్తల ఓవరాక్షన్‌తో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

గోరంట్ల/సోమందేపల్లి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఆయన పాదయాత్ర మంగళవారం గోరంట్ల మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి నుంచి ప్రారంభమైంది. కొత్తపల్లి, మల్లాపల్లి, రాగిమాకులపల్లి మీదుగా పాలసముద్రం చేరుకుంది. అక్కడ భోజన విరామం అనంతరం మిషన్ తండా మీదుగా హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి గుండా సోమందేపల్లి మండలంలోకి ప్రవేశించింది. నల్లగొండరాయునిపల్లిలో రాత్రిబస చేశారు. పాదయాత్రలో ఎక్కడా పెద్దగా జనం కన్పించలేదు. లోకేష్ సహాయక సిబ్బంది మాత్రమే ఎక్కువగా ఉన్నారు. కాగా.. వెలుగుమాకులపల్లి క్రాస్ వద్ద టీడీపీ కార్యకర్తలు రోడ్డుకు అడ్డంగా జెండాలు పట్టుకుని హల్‌చల్ చేశారు. దీంతో జాతీయ రహదారిపై దాదాపు గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


శ్రీనాథ్‌రెడ్డి మృతదేహం

తాడిమర్రి: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మరిమేకలపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఉప్పలూరు కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనాథ్‌రెడ్డి (21) ధర్మవరంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తమ పొలంలో సాగు చేస్తున్న వేరుశనగ, బెండ పంటలకు నీరు పెట్టేందుకు మంగళవారం ఉదయం శ్రీనాథ్ రెడ్డి వెళ్లాడు. మోటర్ పనిచేయకపోవడంతో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎక్కి తీగలను సరిచేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే తాడిమర్రి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా.. డాక్టర్ మహేంద్రనాథ్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

హత్య కేసులో మరో ఇద్దరి అరెస్టు

పావగడ: వైఎన్ హొసకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రబెట్ట గ్రామ రోడ్డు సమీపంలో ఈ నెల 13న చోటుచేసుకున్న ఓ వ్యక్తి హత్య కేసులో ఇప్పటికే ఓ నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేశారు. వివరాలను వైఎన్ హొసకోట రూరల్ సీఐ కాంతరెడ్డి విలేకరులకు వెల్లడించారు. పథకం ప్రకారమే హత్యకు పాల్పడ్డారని తెలిపారు. హతుడు రామాంజి, నిందితులు కావేరి, చిట్టెమ్మ, రవి సంఘటన జరిగిన రాత్రి మహంతపురం నుంచి వైఎన్ హొసకోటకు చేరుకున్నారన్నారు. అక్కడ రామాంజికి పూటుగా మద్యం తాగించి బైకులో ఇంద్రబెట్టకు చేర్చారు. అనంతరం రవి వైఎన్ హొసకోటకు వెళ్లి కావేరి, చిట్టెమ్మను బైకులో ఇంద్రబెట్టకు తీసుకొచ్చాడు. వారి పిల్లల్ని మణి అనే మహిళ వద్ద ఉంచారు. నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి మళ్లీ రామాంజికి మద్యం తాగించారు. మత్తులో ఉన్న రామాంజి కాళ్లు, చేతుల్ని భార్య కావేరి, ఆమె చెల్లెలు చిట్టెమ్మ గట్టిగా పట్టుకోగా రవి పదునైన కత్తితో రామాంజి గొంతు కోశాడు. అనంతరం మృతదేహాన్ని గుర్తు పట్టకుండా బైకులోని పెట్రోలుతో కాల్చి వేసి నిందితులు పరారయ్యారని సీఐ తెలిపారు.

తొలిసారి స్క్రైబ్స్ లేకుండా..

- ల్యాప్‌టాప్ ఆధారంగా 'పది' పరీక్షలు రాయనున్న అంధ విద్యార్థులు
- ఆర్డీటీ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులకు అవకాశం
- డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ నుంచి అనుమతి


ల్యాప్‌టాప్ ద్వారా పరీక్షలు రాయనున్న విద్యార్థులు

రాప్తాడు రూరల్: అంధ విద్యార్థులు పరీక్షలు రాయాలంటే కచ్చితంగా స్క్రైబ్ (సహాయకారి) అవసరం. అంధ విద్యార్థులు జవాబులు చెబితే స్క్రైబ్ రాసేవారు. అయితే రాష్ట్రంలో తొలిసారి అంధ విద్యార్థులు స్క్రైబ్ అవసరం లేకుండా సొంతంగా ల్యాప్‌టాప్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఏప్రిల్ 3 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ఆర్డీటీ నిర్వహిస్తున్న అంధ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఈ విధంగా రాసేందుకు ముందుకొచ్చారు. ఎక్కులూరు దివ్యశ్రీ, పాలిమేర చైత్రిక, ఏకుల సౌమ్య, మేకా శ్రీధత్రి, ఉప్పర నాగరత్నమ్మ, చంచుగారి పావని ల్యాప్‌టాప్ ద్వారాజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. వీరి పరీక్షలకు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ నుంచి అనుమతులు కూడా వచ్చాయి. ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు పరీక్ష రాసే విధానంపై డెమో కూడా ఇచ్చారు.

ముందుగా ప్రశ్నలన్నీ ల్యాప్‌టాప్‌లోకి...

పరీక్షల సమయంలో ముందుగా ఇన్విజిలేటర్ ఆయా విద్యార్థులకు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు చెప్పగానే ల్యాప్‌టాప్‌లోకి ఎక్కించుకుంటారు. వారికి అర్థమయ్యేలా చిన్నశబ్దం వస్తుంది. ఈ శబ్దం ఆధారంగానే ఇది ఫలానా ప్రశ్న అని వారికి అర్థమవుతుంది. ఆ ప్రశ్నకు అవసరమైన జవాబును ల్యాప్‌టాప్‌లోనే పొందుపరుస్తారు. ఇలా అన్ని ప్రశ్నలకూ జవాబులు రాయడం పూర్తయిన తర్వాత ల్యాప్‌టాప్ నుంచి వారు రాసిన జవాబు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీస్తారు. ఆ హార్డ్‌కాపీలకు ఓఎంఆర్ షీటును జతచేసి మూల్యాంకనానికి పంపుతారు. ప్రతి పరీక్షలోనూ ఇదే విధంగా చేస్తారు. డీఈఓ ఎం.సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మాట్లాడుతూ ఆర్డీటీ స్కూల్‌లో మొత్తం 63 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారన్నారు. వారిలో ఆరుగురు విద్యార్థులు ల్యాప్‌టాప్ ద్వారా పరీక్షలు రాయనున్నారు. తక్కినవారందరికీ స్క్రైబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ల్యాప్‌టాప్ ద్వారా పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం రూ.43.10 లక్షలు


హుండీ నగదును లెక్కిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.43.10 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు మంగళవారం ఆలయంలో చేపట్టారు. 49 రోజులకు గానూ రూ.43,10,744 నగదు, అదేవిధంగా అన్నదాన హుండీ ద్వారా రూ.52,260 నగదును భక్తులు సమర్పించినట్లు తెలిపారు. 0.004 గ్రాముల బంగారు, 1.309 కిలోల వెండిని కానుకల రూపంలో స్వామికి సమర్పించినట్లు పేర్కొన్నారు. పాలకమండలి చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఆలయ అధికారులు తదితరులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన పోటీలు రేపు

రాప్తాడు: రాప్తాడులో ఈ నెల 30న రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన (రాతి దూలం లాగుడు పోటీలు) పోటీలు నిర్వహిస్తున్నట్లు లక్ష్మీ పండమేటి రాయుడు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దుల యజమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రూ.60 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎద్దుల యాజమానికి ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి రూ.50 వేలు, తృతీయ స్థానం–ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ రూ.40 వేలు, నాల్గో స్థానం- జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి రూ.30 వేలు, ఐదో స్థానం–ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు రూ.20 వేలు పంపిణీ చేస్తారని తెలిపారు. పాల్గొనదలచిన వారు 81069 46853, 9440088531, 8639828818 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


రక్తపు మడుగులో కోటా ప్రతాప్‌రెడ్డి మృతదేహం


తాడిపత్రి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామం వద్ద మంగళవారం జరిగింది. వివరాలు.. బొందలదిన్నెకు చెందిన కోటా ప్రతాప్‌రెడ్డి (42) మంగళవారం గ్రామానికి సమీపంలోని వంగనూరుకు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బొందలదిన్నె వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయాడు. అదే సమయంలో కడప వైపు నుంచి తాడిపత్రి వైపు వస్తున్న ఉరవకొండకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీ కొన్నాడు. తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రమాదంపై కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బొలెరో ఢీకొని కార్మికుడి మృత్యువాత


మృతి చెందిన చంద్రశేఖర్ నాయక్

గోరంట్ల: మండల పరిధిలోని బూడిదగడ్డపల్లి సమీపంలో కొడూరు–గోరంట్ల ప్రదాన రహదారిపై మంగళవారం బొలేరో వాహనం ఢీకొని కరావులపల్లి తండా గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నాయక్ (32) అనే కార్మికుడు మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రశేఖర్ నాయక్ విధి నిర్వహణలో భాగంగా సొంత గ్రామమైన కరావులపల్లి తండా నుంచి తన ద్విచక్రవాహనంలో బూదిలి సమీపంలోని లెదర్ కంపెనీకి బయలుదేరాడు. బూడిదగడ్డపల్లి సమీపంలో గోరంట్లకు వస్తున్న బొలేరో వాహనం బైకును ఢీకొంది. ఘటనలో చంద్రశేఖర్‌నాయక్ అక్కడిక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


నరేంద్ర మృతదేహం

తాడిమర్రి: మండల పరిధిలోని నార్శింపల్లిలో మంజుల రామాంజినేయులు కుమారుడు నరేంద్ర (16) సోమవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన మంజుల రామాంజినేయులు, రాజేశ్వరి దంపతుల కుమారుడు నరేంద్ర 8వ తరగతి వరకు చదువుకుని బడి మానేశాడు. తండ్రి పక్షవాతంతో బాధపడుతుండడంతో రాళ్లు కొట్టే పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. ఇటీవల పనులకు సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నరేంద్ర సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. బయట నిద్రిస్తున్న తల్లిదండ్రులకు రాత్రి 10 పది గంటల సమయంలో ఇంట్లో వస్తువులు పడిపోయినట్లు శబ్దం రావడంతో తలుపులు తీయడానికి ప్రయత్నించారు. తెరుచుకోకపోవడంతో కిటికీల నుంచి చూడగా నరేంద్ర ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే తలుపులు బద్దలు కొట్టి యువకుడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిగా తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు.